



# పాఠాన్ని మించిన అనుభవం



మనకు ఇష్టమైన పనిలో సంతోషం ఉంటుందన్నది నిజమే. కానీ, ఆ పనిలో మనం ఫిట్ అవుతామో? లేదో? ముందే తెలుసుకోవాలి. ఒక పనిని పూర్తి చేయడానికి సామర్థ్యాలుంటే సరిపోదు. సవాళ్లను స్వీకరించే మనస్తత్వమూ ఉండాలి. నష్టాలను భరించాలి. కష్టాలను అధిగమించాలి. ఎత్తుపల్లాలు దాటితేనే గెలుపు శిఖరం చేరుకునేది. కెరీర్‌ని ప్రారంభించేవాళ్లకు ఎత్తయిన ఆ శిఖరమే కనిపిస్తుంది. ఆ దారిలోని ఎత్తుపల్లాలు తెలిసేది ప్రయాణం మొదలుపెడితేనే. ఆ కష్టాలను భరించలేక వెనుదిరిగితే.. మరో కెరీర్‌ని ఎంచుకోవచ్చు. కొత్త ప్రయాణంలోనూ ముందుకుపోతారు. కానీ, ఇతరులు మీకంటే ముందుంటారు. విలువైన జీవితకాలాన్ని నష్టపోతే అదే శిక్ష. ఆ శిక్షను తప్పించే ముందస్తు శిక్షణే 'వాట్ ఈజ్ మై గోల్' కెరీర్ ఎక్స్‌పీరియన్స్!




... ✍ నాగవర్ధన్ రాయల

వాళ్లకు అర్థమైంది. రాత్రీ పగలూ పనిచేయడానికి సిద్ధపడేవాళ్లు 'సినిమానే మా లైఫ్' అని నిర్ణయించుకున్నారు. ఈ కష్టం పడలేమనుకున్నవాళ్లు ఇంకో పని చూసుకుందామనుకున్నారు. ఇలాంటి వాళ్లకు వాట్ ఈజ్ మై గోల్ ఇంకో రంగాన్ని చూపిస్తుంది.

## 24 కెరీర్‌లు!

ఐదు ఖండాల్లోని రాజ్యాల సరిహద్దులు, వాటి భౌగోళిక విశేషాలు, రాజకీయాల గురించి సాంఘిక శాస్త్రం ఎలా వివరిస్తుందో? ప్రపంచంలో ఉన్న వివిధ రంగాలు, అందులోని ఉద్యోగాల స్వభావం, ఆ ఉద్యోగుల జీవన శైలి గురించి వాట్ ఈజ్ మై గోల్ అవగాహన కల్పిస్తుంది! పని ప్రపంచంలోని వందల రకాల వృత్తుల్ని వాట్ ఈజ్ మై గోల్ 24 వర్గాలుగా విభజించింది. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ ఒక డొమైన్. ఇందులో సాఫ్ట్‌వేర్ టెస్టర్, డెవలపర్, ఏఐ వంటి రకరకాల పనులుచేసే ఇంజినీర్లు ఉంటారు. ఈ ఉద్యోగాల్లో పని ప్రదేశం, జీతం, ఆఫీసు వేళలు, లైఫ్‌స్టైల్, పని ఒత్తిడి ఒకే విధంగా ఉంటాయి. కాబట్టి ఇవన్నీ ఒక డొమైన్. అలాగే ప్రభుత్వంలో అధికారులు, వాళ్ల కింద పని చేసే వాళ్లు ఉంటారు. వీళ్ల బాధ్యతలు, జీతాలు, పని వేళలు, ఎదురయ్యే సవాళ్లు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగులను రెండు డొమైన్ల కింద విభజించారు. ఇలా వాట్ ఈజ్ మై గోల్‌లో చేరిన విద్యార్థి బయటి ప్రపంచంలో ఉన్న అన్ని రకాల అవకాశాల గురించి తెలుసుకుంటాడు. ఆ వృత్తి జీవితం అనుభవమవ్వాలని వారికి కొన్ని లైఫ్ స్కిల్స్ నేర్పిస్తారు. ఆ తర్వాత వారిని ఆ పనుల్లోకి పంపిస్తారు. ఆ పని వేళలు, ఆ పనిలో ఉన్న వాళ్ల జీవితాన్ని దగ్గరగా చూస్తారు. ఇలాంటి అనుభవాలతో విద్యార్థి కెరీర్‌ని ఎంచుకోవడమే కాదు ఎంచుకున్న కెరీర్‌కి తగిన చదువులకు సిద్ధపడతాడు.

## వాట్ ఏ గోల్!

సినిమా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఆతిథ్యం, మీడియా, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, సాఫ్ట్‌వేర్, డాక్టర్, పొలిటీషియన్ ఇలా.. ఏ రంగం ఎలా ఉంటుందో ప్రతి విద్యార్థీ తెలుసుకునేలా 24కి పైగా లైఫ్ స్కిల్స్‌ని వాట్ ఈజ్ మై గోల్ నేర్పిస్తుంది. ఇవి నేర్చుకున్న తర్వాత ఆ పనులు చేసే అవకాశం కల్పిస్తుంది. ఆ పనిలో సొంతంగా ప్రాజెక్టులు చేపట్టాలి. ఏ కెరీర్‌లో ఎంత ఆనందముందో తెలుసుకునేందుకు లక్షా 20 వేల మంది విద్యార్థులు ఈ సంస్థ నెట్‌వర్క్‌లో ఉన్నారు. చూసి రమ్మంటే కాల్చి వచ్చే వాళ్లుంటారే?.. అట్లాంటి పిల్లలు ఈ నెట్‌వర్క్‌లో కూడా ఉన్నారు! ఈ సంస్థ నిర్వహించే ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న పిల్లల్లో కొంతమంది చిన్న ప్రాజెక్ట్ చేపట్టమంటే స్టార్టప్‌లను ప్రారంభించారు. ఆ స్టార్టప్‌లకు క్లయింట్స్‌నూ సంపాదించారు. ఆదాయమూ ఆర్జిస్తున్నారు. విద్యార్థుల విజయాలు చూసి 'వాట్ ఏ గోల్' అంటున్నారు పేరెంట్స్, టీచర్స్! ■